
సాక్షి
పల్నాడు

సోమవారం । 26 । ఆగస్టు । 2024



మండల్ జయంతి వేడుకలు

సత్తెనపల్లి: పట్టణంలోని ఎన్జీవో హోం సెంటర్‌లో బీసీ సంఘాల ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి బీపీ మండల్ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 589.50 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 9,076 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

ఐశ్వర్య ప్రదాయినిగా చందోలు బండ్లమ్మ



పిట్టలవానిపాలెం: చందోలులో కొలువై ఉన్న బండ్లమ్మ వారి దేవాలయంలో శ్రావణమాసం ఆదివారం పురస్కరించుకుని అమ్మవారిని ఐశ్వర్య ప్రదాయినిగా అలంకరించారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి క్రీడోత్సవాలు

జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జి.సురేష్

నరసరావుపేట ఈస్ట్: హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 26 నుంచి 31 వరకు క్రీడోత్సవాలను నిర్వహిస్తున్నట్టు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జి.సురేష్ ఆదివారం తెలిపారు. ఉత్సవాలలో భాగంగా ఔట్‌డోర్, ఇండోర్, సంప్రదాయ క్రీడలతో పాటు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారుల్ని సత్కరించనున్నట్టు తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులు ఈనెల 27లోగా దరఖాస్తుల్ని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయంలో అందజేయాలని ఆయన సూచించారు. ఉత్సవాలలో భాగంగా స్టేడియంలో వాక్, రేస్, వాలీబాల్, హాకీ (పెనాల్టీ షూట్ అవుట్), మినీ ఫుట్‌బాల్, టెన్నిస్ బాల్ క్రికెట్, బాడ్మింటన్, చెస్, బాస్కెట్‌బాల్‌తో పాటు సంప్రదాయ క్రీడలల్లో పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. విజేతలకు ఈనెల 29న నిర్వహించనున్న జాతీయ క్రీడా దినోత్సవంలో కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేస్తామని వెల్లడించారు. వివరాలకు 8712622574 నంబర్‌లో సంప్రదించాలని ఆయన తెలిపారు.

నాగార్జున కొండలో పర్యాటకుల సందడి



విజయపురిసౌత్: ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున కొండను ఆదివారం భారీగా పర్యాటకులు సందర్శించారు. స్థానిక లాంచీ స్టేషన్ సందడిగా మారింది. పలు లాంచీల్లో పర్యాటకులు కొండలోని మ్యూజియానికి చేరుకున్నారు. అందులో బుద్ధుడి ప్రతిమలు, రాతి పనిముట్లు, మట్టి కుండలు, తొమ్మిది అడుగుల బుద్ధుడి పాలరాతి విగ్రహం, మహా స్తూపం, అశ్వమేధ యాగశాల, స్నాన ఘట్టం, సింహళవిహార్‌ను సందర్శించారు. అనంతరం అనుపులోని యాంపి స్టేడియం, శ్రీ రంగనాథస్వామి దేవాలయం, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నమూనా, ఎత్తిపోతల జలపాతాన్ని తిలకించారు. ఆదివారం భారీగా పర్యాటకులు నాగార్జున కొండను సందర్శించడంతో రూ.70వేల ఆదాయం వచ్చినట్లు లాంచీ యూనిట్ అధికారులు తెలిపారు.

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శిగా రవి నియామకం



గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శిగా రేవేంద్రపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు మెల్లెంపూడి రవిని నియమిస్తూ జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ ఉత్తర్వులు అందజేశారు. ఆదివారం తన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో డీఈవో మాట్లాడుతూ.. గతంలో ఎస్‌జీఎఫ్ క్రీడల్లో గుంటూరు జిల్లా జట్లు రాష్ట్ర, జాతీయస్థాయిలో ఎన్నో పతకాలను సాధించాయని గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో ఆ ఫలితాలు పునరావృతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘ అధ్యక్షుడు వినయ్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. వెంకటేశ్వరరావు, టి. వెంకటేశ్వరరావు, రమేష్, రజిని నాయక్, హరికృష్ణ పాల్గొన్నారు.

అడెమ్మ తల్లికి స్వర్ణ నేత్రాలు సమర్పణ



అద్దేపల్లి(భట్టిప్రోలు): భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి గ్రామదేవత అడెమ్మ తల్లికి గ్రామానికి చెందిన మద్దుల శ్రీనివాసరావు కుమారుడు మద్దుల శ్రీరామచంద్రమూర్తి–పద్మప్రియ దంపతులు ఆదివారం స్వర్ణ నేత్రాలు సమర్పించారు. శ్రావణమాసం పురస్కరించుకుని ఆర్యవైశ్యులు సామూహికంగా అమ్మవారిని దర్శించుకుని సారె సమర్పించారు. స్వర్ణ నేత్రాలు సమర్పించిన దంపతులను అద్దేపల్లి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బొలిశెట్టి శ్రీనివాసరావు అభినందించారు. కార్యక్రమంలో రాజేష్, చంద్రకిశోర్, గోవింద రాజులు, సునీల్, విజయ్‌కుమార్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సంఘటన బాధాకరం



కోల్‌కతా సంఘటన బాధాకరం. అక్కడ ఒక మహిళ సీఎం గాను, దేశానికి ఒక మహిళ రాష్ట్రపతి గాను, ఆ రాష్ట్రానికి చెందిన 11మంది మహిళలు ఎంపీలుగా ఉండగా ఇటువంటి సంఘటన జరగటం చాలా శోచనీయం. డాక్టర్లపై దాడుల్ని అరికట్టడానికి దివంగత వైఎస్సార్ చట్టం చేసి జీవో కూడా జారీ చేశారు. అయితే, ఆయన మరణానంతరం అది అమలుకాలేదు. దీనికి ప్రభుత్వ విధానాలు మారటమే పరిష్కారం.

–డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి, సీనియర్ ఎండీ, నరసరావుపేట



ప్రభుత్వ ఆస్పత్రుల్లో సెక్యూరిటీ పెంచాలి



ప్రభుత్వ హాస్పిటళ్లలో డాక్టర్లు, నర్సులకు సెక్యూరిటీ పెంచాలి. పోలీసు అవుట్ పోస్టు, సీసీ కెమెరాలు, రెస్ట్ రూంల సౌకర్యం కల్పించాలి. డాక్టర్లపై దాడులు చేస్తే పరిస్థితి చాలా సీరియస్‌గా ఉంటుందనే మెసేజ్ పబ్లిక్‌లోకి పంపించాలి. అప్పుడే డాక్టర్లు సక్రమంగా విధులు నిర్వహించగలుగుతారు. ప్రజలకు కూడా న్యాయం జరుగుతుంది.

–డాక్టర్ లక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ప్రభుత్వ హాస్పిటల్ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు

ఫీవర్ ఫియర్

జ్వరాలతో జిల్లా ప్రజలు వణికిపోతున్నారు. వరుస వర్షాలతో, ప్రభుత్వ నిర్లక్ష్యంతో పల్లెల్లో పారిశుద్ధ్యం పడకేసింది. ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. చివరికి పల్లెల్లోని ఆర్‌ఎంపీల వద్ద కూడా బారులుదీరుతున్నారు. వైద్యులు, అధికారులు ఈ సీజన్‌లో సహజమేనని కొట్టిపారేస్తున్నా రోగులు మాత్రం నరకయాతన పడుతున్నారు. జ్వరానికి కీళ్ల నొప్పులు, జలుబు, దగ్గు తోడవ్వడంతో పలువురు ఆస్పత్రుల పాలవుతున్నారు. ఇటు పరీక్షలు, చికిత్సల ఖర్చులతో పేద, మధ్యతరగతి వారికి కష్టాలు రెట్టింపు అవుతున్నాయి. మంచం పట్టిన ఆరోగ్య రంగాన్ని, యంత్రాంగాన్ని నడిపించాల్సిన ప్రభుత్వం మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తోంది. మందు బిళ్ల అందించే దిక్కు కూడా లేదు.

- జిల్లాలో జ్వరాలు విలయతాండవం
- ఇంటింటికి జ్వర పీడితులు
- మారిన వాతావరణంతో పెరిగిన దోమలు
- పట్టణ, గ్రామాల్లో అధ్వానంగా పారిశుద్ధ్యం
- ప్రభుత్వ, ప్రైవేటు హాస్పిటళ్లు కిటకిట
- జేబులు నింపుకుంటున్న పీఎంపీ, ఆర్‌ఎంపీలు
- ఈ సీజన్‌లో జ్వరాలు సహజమే అంటున్న వైద్యులు
- చర్యలు తీసుకుంటామంటున్న అధికారులు



లింగంగుంట్ల కాలనీలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో ఓపీ నమోదుకు బారులు తీరిన రోగులు

నరసరావుపేట: పల్నాడు జిల్లా విష జ్వరాలతో అట్టుడుకుతోంది. వర్షాలు, వరదలతో పారిశుద్ధ్యం పడకేసింది. మారిన వాతావరణంతో చెలరేగిన దోమలు చెండుకు తింటున్నాయి. గ్రామాలకు గ్రామాలే మంచం పడుతున్నాయి. పిల్లలు, యువకులు, వృద్ధులు అనే తేడా లేకుండా జ్వరాల బారినపడుతున్నారు. ఇదే అదనుగా ప్రైవేటు హాస్పిటళ్ల నిర్వాహకులు, గ్రామాల్లో పీఎంపీలు, ఆర్‌ఎంపీలు ప్రజల జేబులు ఖాళీ చేస్తున్నారు. అధికారంలో ఉన్న టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రభుత్వ హాస్పిటళ్లను పట్టించుకోకపోవడంతో రోగులు గడప తొక్కడానికి ఆలోచిస్తున్నారు. హాస్పిటళ్ల, ప్రైవేటు వైద్యుల చుట్టూ తిరుగుతున్నారు. జిల్లావ్యాప్తంగా మూడు ఏరియా హాస్పిటళ్లు, పది ఏబీవీపీ హాస్పిటళ్లు, 38 పీహెచ్‌సీలు పని చేస్తున్నా ప్రజలకు సక్రమంగా వైద్యసేవలు అందడం లేదు. అయినా ప్రభుత్వ హాస్పిటళ్లలో రోజురోజుకూ ఓపీ సంఖ్య పెరుగుతోంది. నరసరావుపేట 200పడకల ఏరియా వైద్యశాలలో రోజూ 1000 నుంచి 1200వరకు నమోదవుతున్నాయి. వీరికి తగ్గట్లుగా మందులు లేవు, కొన్నిరకాల మందులను బయటకు రాస్తున్నారనే విమర్శలు పేషెంట్ల నుంచి వ్యక్తమవుతున్నాయి.

కోరలు చాచిన అతిసారం



ఉపాధ్యాయుడు దేవరత్నం (ఫైల్)

జిల్లాలో ఈనెలలో అతిసార ప్రభావంతో పలు కాలనీల ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. వీరిలో తొమ్మిది మంది చనిపోయారు. స్వయంగా మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరి నారాయణ పిడుగురాళ్లకు వచ్చి పరిశీలించడం పరిస్థితి తీవ్రతకు అద్దంపడుతోంది.

❖ కారెంపూడి మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలో డయేరియా ఇంకా అదుపులోకి రాలేదు. ఆదివారం కూడా మూడు కేసులు వెలుగుచూశాయి. వారిలో ఇద్దరిని నర్సరావుపేట జిల్లా హాస్పిటల్‌కు తరలించారు. మరొకరు నర్సరావుపేటలో ప్రైవేటు హాస్పిటల్‌కు వెళ్లారు. ఇదిలా ఉంటే గతంలో డయేరియా వచ్చిన వారిలో ఇంకా ఏడుగురు కోలుకోవాల్సి ఉంది. ఇదిలా ఉంటే ఇప్పటికే ఇద్దరు మృత్యువాత పడ్డారు. గ్రామంలో ఈనెల ఐదవ తేదీ నుంచి ఇప్పటివరకు 62మంది అతిసారకు గురయ్యారు. వారిలో తొమ్మిదిమంది హాస్పిటళ్లలో చికిత్స పొందారు. ఇద్దరు వ్యక్తులు వంకాయలపాటి సత్యం, మాదల వెంకటేశ్వర్లు చనిపోయారు. కాగా, ప్రస్తుతం మూడు కేసులు బయటపడ్డాయి.



గురజాలలో బాధితురాలిని పరామర్శిస్తున్న డీఎం అండ్ హెచ్‌వో రవి (ఫైల్)

హాస్పిటళ్లలో చికిత్స పొందుతున్నారు.

❖ పిడుగురాళ్ల పట్టణ శివారులోని లెనిన్‌నగర్, మారుతీనగర్, పట్టణ శివారు ప్రాంతాలకు చెందిన 150మంది అతిసారతో వాంతులు, విరేచనాలకు గురయ్యారు. వీరిలో తిరుమలగిరి ఆంజనేయులు, ఓర్సు ఆంజనేయులు, తిరుపతమ్మ, ఉపాధ్యాయుడు డి.దేవరత్నంతో పాటు ఏడుగురు చనిపోయారు.

❖ మాచవరం మండలం గంగిరెడ్డిపాలెం ఎస్సీ కాలనీలో ఎనిమిది మంది అతిసార బారిన పడ్డారు. నలుగురు నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాల, మరో ముగ్గురు గుంటూరు జీజీహెచ్ వైద్యశాలలో చికిత్స పొందారు. అదృష్టవశాత్తు అందరూ కోలుకున్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం

వర్షాలకు పారిశుద్ధ్యం పడకేయడంతో దోమల విజృంభణతో మలేరియా, ఫైలేరియా, చికున్ గున్యా, డెంగ్యూ జ్వరాలు, విష జ్వరాలతో ప్రజలు అల్లాడుతున్నారు. ఒళ్లు వెచ్చబడటం, కాళ్లు చేతుల్లో నెప్పులు, తల తిరగటం, వాంతులు, విరేచనాలు వంటి వాటికి గురవుతున్నారు. డయేరియా కారణంగా మాచవరం, కారెంపూడి మండలంలోని ఒప్పిచర్ల, పిడుగురాళ్లలో కొంతమంది మృత్యువాతకు గురయ్యారు. కాగా, ప్రభుత్వ లెక్కలు మాత్రం పరిస్థితికి భిన్నంగా కన్పిస్తున్నాయి. గత నెలలో డెంగ్యూ కేసులు 143, ఈనెల రెండు మలేరియా, 150 డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. గురజాల నియోజకవర్గంలోని దాచేపల్లి, మాచవరం, పిడుగురాళ్ల మండలాల్లో జ్వరాలు అధికంగా ఉన్నాయి. దాచేపల్లి మండలంలో రోగులు ఒళ్లు నెప్పులు, కాళ్లవాపులు కన్పిస్తున్నాయని చెబుతున్నారు. అలాగే పెదకూరపాడు నియోజకవర్గంలోని క్రోసూరు, అచ్చంపేట మండలాల్లో ప్రజలు జ్వరాలతో తీవ్రంగా బాధపడుతున్నారు.





కారెంపూడి మండలంలోని ఒప్పిచర్లలో గ్రామ ప్రధాన రహదారి వెంట వ్యర్థాలు

దోమలే రోగాలకు కారణం



ఈ సీజన్‌లో దోమలు వల్ల రోగాలు రావడం సహజం, ఇది వచ్చే నెల కూడా కొనసాగవచ్చు. దోమలు పెరగకుండా జిల్లావ్యాప్తంగా చర్యలు చేపట్టాం. నీరు నిల్వున్న ప్రదేశాల్లో లార్వాలు పెరుగుతాయి. ఈ లార్వాలను చంపేందుకు గంబూషియా చేపలను తెప్పించి కుంటల్లో వదిలాం. ఆయిల్ బాల్స్ విడుదల చేస్తున్నాం. డెంగీ కేసు బయటపడిన చోట ఫాగింగ్ నిర్వహించి మురుగుకాలువలు, ఇళ్లల్లోని నీరు నిల్వుండకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రజల్ని అప్రమత్తం చేస్తున్నాం. దోమలు కుట్టకుండా తెరలు వాడాలి. పొడవు చేతుల చొక్కాలు ధరించాలి. ఇళ్లల్లోకి దోమలు ప్రవేశించకుండా సాయంత్రం 6గంటలకల్లా తలుపులు మూసేయాలి. చుట్టూ శుభ్రంగా ఉంచుకోవాలి.

–డాక్టర్ రవీంద్ర రత్నాకర్, జిల్లా మలేరియా అధికారి

ప్రత్యేక క్యాంపులు నిర్వహణ



జిల్లాలో అక్కడక్కడా విషజ్వరాలు ప్రబలాయి. అచ్చంపేట, క్రోసూరు, పిడుగురాళ్ల, గురజాల నియోజకవర్గంలోని జంగమహేశ్వరపురం లాంటి ప్రదేశాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించాం. ఇంటింట సర్వే చేశాం. జ్వరం వచ్చిన వ్యక్తులు మందులు వాడుతూ విశ్రాంతి తీసుకుంటే తగ్గిపోతుంది. ప్రతి పట్టణం, గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాలని అధికారుల్ని ఆదేశించాం. ప్రజల్ని అప్రమత్తం చేస్తున్నాం.

–డాక్టర్ బి.రవి, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి

కౌలు ధరలు ఢమాల్

- ముందుకురాని కౌలు రైతులు
- నిరుపయోగంగా పంట భూములు
- ఆందోళనలో యజమానులు



బీడుగా ఉన్న పొలం

రొంపిచర్ల: మండలంలో ఈ ఏడాది భూముల కౌలు ధరలు అమాంతంగా పడిపోయాయి. మాగాణి భూములు సాగుకు అనుకూలంగా లేకపోవడంతోపాటు పెట్టుబడి వ్యయం పెరిగి కౌలు రైతులు సాగు చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. సొంతంగా సాగు చేసే అవకాశాలు లేక కౌలు రైతులు ముందుకు రాకపోవడంతో భూ యజమానులు ఆందోళన చెందుతున్నారు. దీంతో మండలంలో మాగాణి సాగు ప్రశ్నార్థకంగా మారింది. మండలంలో 42 వేల ఎకరాల సాగు భూములు ఉన్నాయి. అందులో 30 వేల ఎకరాలు మాగాణి, 12 వేల ఎకరాలు మెట్ట భూములు ఉన్నాయి. ప్రతి ఏటా 30 వేల ఎకరాల మాగాణి భూముల్లో వరి సాగు చేస్తుండగా, మెట్ట భూముల్లో పత్తి తదితర వాణిజ్య పంటలు సాగు చేస్తున్నారు.

బీడు వారిన భూములు

గతేడాది వర్షాభావ పరిస్థితులు, సాగర్ జలాశయంలో నీరు లేకపోవడంతో మాగాణి భూముల్లో అత్యధిక భాగం సాగు చేయకుండా వదిలేశారు. వాగులు, చెరువులు, మోటార్ల ద్వారా వెయ్యి నుంచి రెండు వేల ఎకరాలలో మాత్రమే వరి సాగు చేశారు. దీంతో మిగిలిన భూముల్లో పిచ్చి కంప పెరిగింది. భూమి నెర్రులిచ్చింది.

నీరు వచ్చినా కష్టమే..

ఈ ఏడాది నాగార్జునసాగర్ ప్రాజెక్ట్‌లో సాగుకు అవసరమైన నీరు సమృద్ధిగా ఉన్నా మాగాణి పంటలను సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. గతేడాది సాగు చేయకపోవడంతో పెరిగిన కంప తొలగింపు భారం కావడంతో కౌలు రైతులు ఆసక్తి చూపడం లేదు. దీనికి తోడు సొంత భూములున్న రైతులు కుటుంబంలో పనులు చేసే వారు లేక కౌలు దారులపైనే ఆధారపడుతున్నారు. వయోభారం, తమ పిల్లలు ఉద్యోగాలు, వ్యాపారాల రీత్యా పట్టణాలు, ఇతర ప్రాంతాలు, విదేశాల్లో ఉండటం వల్ల వ్యవసాయం చేసేవారు లేక కౌలు ధరలు పడిపోయినట్లు భూ యజమానులు తెలుపుతున్నారు. గతేడాది మాగాణి సాగు లేనందువల్ల కౌలు రైతులు ఎక్కువ మంది తమ వృత్తులను మార్చుకొని ఇతర ప్రాంతాలకు వెళ్లారు. ఆ ప్రభావం కూడా కౌలు రేట్లపై చూపించినట్లు కనబడుతోంది.

పెరిగిన పెట్టుబడి వ్యయం

పెట్టుబడి వ్యయం విపరీతంగా పెరిగింది. కూలీ రేట్లు, ట్రాక్టర్ల బాడుగుల ధరలు పెరిగాయి. పెట్టుబడి అధికం అవ్వడం వల్ల కౌలు రైతులు ధైర్యంగా సాగుకు ముందుకెళ్లలేక పోతున్నారు. దీనికి తోడు గతేడాది మాగాణి సాగు లేకపోవడం వల్ల భూములన్నీ బండబారాయి. పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. మాగాణి సాగులో నీరు నిల్వకు అవసరమైన గట్లు శిథిలమైపోవటంతో మరింత పెట్టుబడి ఖర్చు పెరిగింది.

మెట్ట భూముల కౌలు ఓకే

మండలంలో 12 వేల ఎకరాలలో మెట్ట పంటలు సాగు చేస్తున్నారు. మెట్ట భూములకు రూ.15,000 నుంచి రూ.20,000 వరకు కౌలు చెల్లిస్తున్నారు. దీనిలో కూడా ఐదు వేల ఎకరాలలో సుబాబుల్ సాగు చేస్తున్నారు.

మెరక భూములకు గిరాకీ

నీటి వసతి, రహదారి సౌకర్యంతోపాటు మాగాణి పొలం శుభ్రంగా ఉండి, దుక్కులు తక్కువగా పడే భూమికి కొంతమేర కౌలు గిరాకీ ఉంది. పల్లపు భూములకు ధరలు తక్కువగా ఉన్నాయి. మెరక భూములైతే మొదటి పంటగా వరి, రెండో పంటగా మొక్కజొన్న, మినుము, పెసర వంటి పైర్లు పండుతాయని రైతులు చెబుతున్నారు. రెండేళ్ల కింద ఎకరాకు ఎనిమిది నుంచి 15 బస్తాల వరకు కౌలు పలికిన భూములు ఈ ఏడాది మూడు నుంచి 12 బస్తాలకే పరిమితమైంది. దారిమార్గం తక్కువగా ఉండి గ్రామాలకు దూరంగా ఉండే పొలాలను కౌలుకు అడిగే వారే లేరని రైతులు తెలుపుతున్నారు. మరికొందరు భూ యజమానులు పంటలు సాగుచేసుకోండి, దిగుబడులు వస్తేనే కౌలు చెల్లించండి అని తెలుపుతున్నారు. భూములతో పాటు పెట్టుబడికి అవసరమైన డబ్బు ఉన్న యజమానులు వరిసాగుకు అవసరమైన అంతా పెడతామన్నా కౌలుదారులు ముందుకు రావడం లేదు. అధిక పెట్టుబడులు, అన్నింటిని మించి దిగుబడులు సాధించినా వాటిని అమ్ముకునే సమయానికి గిట్టుబాటు ధర లేకపోతే పూర్తిగా నష్టపోవాల్సి వస్తుందని కౌలుదారులు అంటున్నారు.

కౌలుకు చేసే వారు లేరు



నాకు 4.5 ఎకరాల మాగాణి భూమి ఉంది. నాలుగేళ్ల కిందట వరకు నేనే పంటలు సాగు చేసేవాడిని. ఆరోగ్య రీత్యా వ్యవసాయ పనులు మానేశా. రెండేళ్లపాటు కౌలుకు ఇచ్చా. గత ఏడాది సాగునీరు లేక బీడుగానే ఉంది. ఈ ఏడాది మా పొలాన్ని ఎవ్వరూ కౌలుకు అడగడంలేదు. గతంలో చేసిన వారిని పంట వేసుకోండి, పెట్టుబడులు పోను మిగిలితే ఎంతో కొంత కౌలు చెల్లించండి అని చెప్పినా ముందుకు రావడం లేదు.

–కోటేశ్వరరావు, భూయజమాని, సంతగుడిపాడు

పెట్టుబడి పెరిగింది.. కౌలు రేటు తగ్గింది



నాకు సొంత పొలం సెంటు కూడా లేదు. పూర్తిగా కౌలు పొలం పైనే ఆధారపడి వ్యవసాయం చేస్తా. నేను వ్యవసాయం చేయడం ప్రారంభించినప్పుడు కౌలు ధరలు 12 బస్తాలు ఉండేది. ప్రస్తుతం ఆ పొలాల కౌలు ధరలు 4, 5 బస్తాలకే దిగివచ్చింది. కౌలు ధరలు తగ్గినా సాగు విస్తీర్ణం తగ్గించుకున్నా. ఈ ఏడాది నాలుగు ఎకరాల్లోనే వరి సాగు చేయాలనుకుంటున్నా.

–కోటిరెడ్డి, కౌలు రైతు, సంతగుడిపాడు

భక్తిశ్రద్ధలతో అమరేశ్వరుడికి పవిత్రాల సమర్పణ



పవిత్రాలను తీసుకువెళుతున్న భక్తులు

అమరావతి: స్థానిక అమరేశ్వరస్వామి దేవస్థానంలో వార్షిక పవిత్రోత్సవాలలో భాగంగా రెండో రోజు ఆదివారం శాస్త్రోక్తంగా మండప పూజతో పాటు పలు హోమాలు నిర్వహించారు. అమరేశ్వరుడు, బాలచాముండేశ్వరీదేవితో పాటు 18 ఉపాలయాల్లో పట్టు పవిత్రాలు సమర్పించారు. రుద్ర, చండీ హోమాలతో పాటు విశేష హోమాలు జరిపారు. బ్రహ్మశ్రీ పీసపాటి నాగేశ్వరశర్మ ఆధ్యాత్మిక ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి వేమూరి గోపీనాథశర్మ మాట్లాడుతూ విజయవాడకు చెందిన యార్లగడ్డ ఉపేంద్ర, విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో అమరేశ్వరునికి వార్షిక పవిత్రోత్స వాలు వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. నిత్యపూజా కార్యక్రమాలలో జ్ఞాతా జ్ఞాతములైన మంత్ర తంత్ర శౌచా లోపాల వల్ల కలిగే దోషాల నివృత్తికి విధిగా ప్రతి ఏడాది పవిత్రోత్సవాల్ని శాస్త్రానుసారం నిర్వహిస్తున్నామని తెలిపారు. పవిత్సోవాలలో ముగింపు సందర్భంగా సోమవారం ఉదయం 11 గంటలకు మహా పూర్ణాహుతి నిర్వహిస్తామని పేర్కొన్నారు. భక్తులంతా పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో విజయవాడ శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవస్థానం అర్చకులు రంగావజ్జల శ్రీనివాసశాస్త్రి, శ్రీఅమరేశ్వరస్వామి దేవస్థానం అర్చకులు కైతేపల్లి సుధీర్ శర్మ, స్థానాచార్యులు కౌశిక చంద్రశేఖర్‌శర్మ, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

లక్‌పతి దీదీ ప్రశంసా పత్రాల పంపిణీ



రుణ చెక్కులు అందజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎంపీ లావు, ఎమ్మెల్యే చదలవాడ

నరసరావుపేట: మహారాష్ట్ర జలగాంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదివారం ప్రారంభించిన లక్‌పతి దీదీ కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అరుణ్‌బాబు, ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు వర్చువల్‌గా వీక్షించారు. అనంతరం ముగ్గురు కలిసి డీఆర్‌డీఏ పీడీ బాలు నాయక్ ఆధ్వర్యంలో 5,184 మందికి లక్‌పతి దీదీ ప్రశంసా పత్రాలు అందించారు. సీఐఎఫ్ రుణాలు రూ.20లక్షలు, బ్యాంక్ లింకేజీ రుణాలు రూ.54.14కోట్ల చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు, మహిళలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శాస్త్రీయ దృక్పథంతోనే జన జాగృతం

ఎమ్మెల్సీ లక్ష్మణరావు



చిలకలూరిపేట టౌన్‌: శాస్త్రీయ దృక్పథంతోనే జన జాగృతం సాధ్యమని ఎమ్మెల్సీ కె.ఎస్‌. లక్ష్మణరావు పేర్కొన్నారు. జనవిజ్ఞాన వేదిక పల్నాడు జిల్లా 18వ వార్షిక సమావేశాన్ని ఆదివారం స్థానిక సాదినేని చౌదరయ్య పాఠశాలలో నిర్వహించారు. సమావేశంలో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి జేవీవీ ప్రతినిధులు పాల్గొని ప్రసంగించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ జిల్లాలో విభజన తర్వాత జనవిజ్ఞాన వేదిక మరింత విస్తృతంగా కార్యక్రమాల్ని చేపట్టాల్సిన అవసరం ఉందని హితవు పలికారు. అన్ని వర్గాల ప్రజలకు చేరువగా, వారి భాగస్వామ్యంతో రోజురోజుకూ అభివృద్ధి చెందాలని తెలిపారు. ఈ ప్రక్రియలో సంఘం సభ్యులు ముఖ్యపాత్ర పోషించాలని ఆయన సూచించారు. జేవీవీ రాష్ట్ర కార్యదర్శి కుర్రా రామారావు, జేవీవీ జిల్లా అధ్యక్షులు డాక్టర్‌ దార్ల బుజ్జిబాబు మాట్లాడుతూ గత సంవత్సరం చేపట్టిన కార్యక్రమాల కన్నా ఈ ఏడాది మరెక్కువ చేయాలని జిల్లా ప్రతినిధులకు సూచించారు. సాదినేని చౌదరయ్య స్కూల్‌ డైరెక్టర్‌ ప్రభాకరరెడ్డి, న్యాయవాది మాదాసు భాను ప్రసాద్‌, సాహితీవేత్త డాక్టర్‌ పి.వి. సుబ్బారావు, వ్యాపారవేత్త ధూళిపాళ్ల వెంకటరావు, ఉపాధ్యాయిని టి.కుమారి తదితరులు ప్రసంగించారు. అనంతరం ఎమ్మెల్సీ లక్ష్మణరావు రూపొందించిన సివిల్‌ సర్వీసెస్‌ ప్రాథమిక సంకలన పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్‌ స్మార్ట్‌ మీటర్ల బిగింపు తగదు

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్‌



లక్ష్మీపురం: విద్యుత్తు స్మార్ట్‌ మీటర్ల పేరిట రాష్ట్ర ప్రజలపై కూటమి ప్రభుత్వం పెనుభారాన్ని మోపే ప్రయత్నాన్ని విరమించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్‌ డిమాండ్‌ చేశారు. కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌ సీపీఐ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దీనికి సంబంధించి గత ప్రభుత్వం హయాంలోనే టెండర్లు కొందరు దక్కించుకుంటే ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం పార్టీ పూర్తిగా వ్యతిరేకించిన విషయాన్ని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు మీటర్ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం తగదన్నారు. దీనివల్ల వినియోగదారులపై పెనుభారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెనక్కి తగ్గకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

డ్రగ్స్‌ మాఫియాను నియంత్రించాలి



డ్రగ్స్‌ మాఫియా వేళ్లూనుకున్న చోట కోల్‌కతా లాంటి సంఘటనలు జరుగుతుంటాయి. ఈ ఘటన చాలా బాధాకరం. దేశానికి స్వాతంత్రం వచ్చి 75ఏళ్లు గడిచినా అప్పటి సౌకర్యాలే మెడికల్‌ కళాశాలలు, హాస్పిటల్స్‌లో ఉన్నాయి. జనాభాకు తగ్గట్లుగా డాక్టర్లు పెరుగుతున్నా ఆస్పత్రుల్లో వారికి సౌకర్యాలు మాత్రం పెరగట్లేదు. ముఖ్యంగా భద్రతతో పాటు రక్షణ కల్పించాలి. పోలీసుల కాపలా, సీసీ కెమెరాలు, రెస్ట్‌రూమ్‌లు ఏర్పాటుచేయాలి. చట్టాలు పకడ్బందీగా అమలుకావాలి. వీటిపై పాలకులు దృష్టి సారించాలి.

–డాక్టర్‌ రాంప్రసాద్‌, అశ్వని లేబరేటరి, నరసరావుపేట



24 గంటలు పోలీసుల రక్షణ ఉండాలి



ప్రభుత్వ హాస్పిటళ్లకు 24 గంటలు పోలీసు రక్షణ ఉండాలి. ఆ సౌకర్యం ఉంటే డాక్టర్లు స్వేచ్ఛగా వైద్యం అందించగలుగుతారు. పోలీసులు ఉంటే పేషెంట్లు, వారి బంధువులకు ఒక హెచ్చరికగా ఉంటుంది. ఇతర వ్యక్తులు లోపలికి వచ్చేందుకు సంకోచిస్తారు. పనిచేసి విశ్రాంతి తీసుకుందామనుకునే డాక్టర్లకు రెస్ట్‌రూమ్‌లు, సరైన మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలి. అప్పుడే ప్రజలకు సక్రమంగా వైద్యం లభిస్తుంది.

–డాక్టర్‌ కె. శ్రీనివాసరెడ్డి, ఈఎన్‌టీ వైద్యులు, ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ మాజీ అధ్యక్షులు

నల్లబజారుకి నిత్యావసరాలు?

కేజీబీవీలో విచారణ చేపట్టిన జీసీడీవో, ఇన్‌చార్జ్‌ ఎంఈఓ

గోళ్ళపాడు(ముప్పాళ్ల): పేద విద్యార్థులకు కడుపు నిండా ఆహారం అందించేందుకు గాను ప్రభుత్వం అందించే నిత్యావసరాలు పాఠశాల నుంచి పక్కదారి పడుతున్నాయి. అర్ధరాత్రి దాటాక నిత్యావసర వస్తువులు తీసుకెళ్లేందుకు ఆటో లోపలికి రావటడాన్ని గమనించిన స్థానికులు అడ్డుకుని జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. విషయం బయటకు పొక్కడంతో పాఠశాల సిబ్బంది ఆటోను వెనక్కి పంపించారు. జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు ఇన్‌చార్జి ఎంఈఓ శ్రీనివాసరావు, జీసీడీవో రేవతి ఆదివారం పాఠశాలకు చేరుకొని విచారణ చేపట్టారు. నిత్యావసర వస్తువుల్లో కొద్ది పాటి వ్యత్యాసాలు ఉన్నట్లుగా గుర్తించినట్లు జీసీడీవో చెప్పారు. రికార్డుల్లో నిల్వకు సుమారు 50 కేజీల బియ్యం తక్కువగా ఉన్నట్లుగా గుర్తించినట్లు ఆమె తెలిపారు. రికార్డుల నిర్వహణ లోనూ లోపాలు గుర్తించామన్నారు. విచారణలో గుర్తించిన అంశాల్ని ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని చెప్పారు.



గోళ్లపాడు కేజీబీవీ ప్రధాన గేటు వద్ద అర్ధరాత్రి ఆటోలో ఉన్న రేషన్‌ బియ్యం

అర్ధరాత్రి దాటాక పాఠశాలలోకి ఎలా?

అర్ధరాత్రి దాటాక పాఠశాలలోకి ఆటోను ఎలా అనుమతి ఇచ్చారనేది విచారణలో తేలాల్సి ఉంది. పాఠశాలలో చదివే విద్యార్థినుల తల్లిదండ్రులకు కూడా సెలవు రోజుల్లో వారి పిల్లల్ని చూసుకునేందుకు లోపలికి అనుమతి ఇవ్వరు. ప్రధాన గేటు వద్దే పడిగాపులు కాస్తూ, చెట్ల కింద కూర్చొని గేటులోంచి పలకరించి వెనుదిరగాల్సి వచ్చేది. అలాంటిది అర్ధరాత్రి దాటాక ఆటో డ్రైవర్‌తో పాటుగా మరో వ్యక్తి పాఠశాల ప్రధాన గేటు దాటి లోపలికి ఎలా అనుమతి లభించిందనేది అనుమానాలకు దారి తీస్తోంది. ఇదే విషయాన్ని జీసీడీవో దృష్టికి తీసుకురాగా ఈ విషయం పై విచారణ చేస్తున్నామని సమాధానం దాట వేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులు, అఘాయిత్యాల నేపథ్యంలో ఆడపిల్లలు ఉండే పాఠశాలలోకి ఆటోతో వ్యక్తులు ప్రవేశించడంపై స్థానికులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఆటో సంబంధించిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నా వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. గతంలోను పాఠశాలలో విద్యార్థినులకు భోజనం అందక ఇబ్బందులు పడిన రోజులు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పాఠశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



కేజీబీవీలో తనిఖీలు చేస్తున్న జీసీడీవో రేవతి, ఇన్‌చార్జ్‌ ఎంఈఓ శ్రీనివాసరావు

రసవత్తరంగా కృష్ణా, ప్రకాశం మ్యాచ్‌

నరసరావుపేట ఈస్ట్‌: ఆంధ్రా క్రికెట్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్‌ క్రికెట్‌ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న సెంటర్‌ జోన్‌ అండర్‌-23 క్రికెట్‌ పోటీల్లో భాగంగా కృష్ణా, ప్రకాశం జిల్లాల మధ్య మ్యాచ్‌ రసవత్తరంగా మారింది. కృష్ణా జిల్లా జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 229 పరుగులకు ఆలౌట్‌ అయింది. నిన్నటి ఓవర్‌ నైట్‌ స్కోర్‌ రెండు వికెట్లు నష్టానికి 38 పరుగులు చేసిన ప్రకాశం జట్టు ఆదివారం రెండో రోజు తొలి ఇన్నింగ్స్‌లో 210 పరుగులకు ఆలౌట్‌ అయింది. జట్టులోని ఎస్‌.నిఖిల్‌ 10 ఫోర్లు, నాలుగు సిక్స్‌లతో నాటౌట్‌గా నిలువగా, జి.పార్థసారధి 42 పరుగులు సాధించాడు. కృష్ణా బౌలర్‌ మానస్‌ మూడు వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో 19 పరుగుల ఆధిక్యతతో రెండో ఇన్నింగ్స్‌ ప్రారంభించిన కృష్ణా జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆరు వికెట్లు నష్టపోయి 159 పరుగులు చేసింది. జట్టులోని ఆర్యన్‌సాయి 78 పరుగులతో క్రీజ్‌లో ఉన్నాడు. ప్రకాశం బౌలర్‌ పి.నవీన్‌ 3వికెట్లు సాధించాడు. సోమవారం మూడోరోజు ఆట కొనసాగనుంది. మ్యాచ్‌ను గ్రౌండ్‌ అడ్మినిస్ట్రేటర్‌ ఎస్‌.సీతాపతిరావు పర్యవేక్షించారు.



అఖిల్‌, 84 నాటౌట్‌, ప్రకాశం జట్టు

పులిచింతలకు 29,792 క్యూసెక్కులు విడుదల



సత్రశాల(రెంటచింతల): నాగార్జునసాగర్‌ టైల్‌ పాండ్‌ విద్యుత్‌ ప్రాజెక్టు నుంచి మూడు క్రస్ట్‌ గేట్లు, రెండు యూనిట్లు ద్వారా మొత్తం 29,792 క్యూసెక్కుల నీటిని దిగువనున్న పులిచింతల ప్రాజెక్ట్‌కు విడుదల చేస్తున్నట్లు ఆ ప్రాజెక్ట్‌ ఏడీఈ ఎస్‌. జయశంకర్‌, ఏఈ జయపాల్‌ ఆదివారం తెలిపారు. టైల్‌ పాండ్‌ ప్రాజెక్టు మూడు క్రస్ట్‌ గేట్లను 1.50 మీటర్లు ఎత్తి 21,258 క్యూసెక్కులు, ప్రాజెక్టులోని రెండు యూనిట్లు ద్వారా 1.0634 మిలియన్‌ యూనిట్లు విద్యుత్‌ ఉత్పత్తి అనంతరం 8,534 క్యూసెక్కులు కలిపి మొత్తం 29,792 క్యూసెక్కుల నీటిని దిగువనున్న పులిచింతల ప్రాజెక్ట్‌కు విడుదల చేస్తున్నట్లు వివరించారు. విద్యుత్‌ నీటి మట్టం ప్రాజెక్టు 75.50 మీటర్లకు గాను 75.45 మీటర్లకు నీరు చేరుకుందని, రిజర్వాయర్‌లో గరిష్ట స్థాయిలో 7.080 టీఎంసీలకు గాను 7.046 టీఎంసీలు నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు. నాగార్జునసాగర్‌ నుంచి ఇక్కడకు మొత్తం 28,988 క్యూసెక్కులు వరద నీరు వస్తుందన్నారు. టీఆర్‌సీ లెవల్‌ 55.56 మీటర్లకు చేరుకుందని చెప్పారు. ఎగువ నున్న నాగార్జున సాగర్‌ నుంచి వచ్చే వరదను బట్టి దిగువనున్న పులిచింతలకు నీటిని విడుదల చేస్తామని తెలిపారు.

కనులపండవగా అంకాలమ్మ బోనాల ఉత్సవం

కారెంపూడి: పల్నాటి వీర్ల అంకాలమ్మ తల్లి బోనాల పండుగ ఆదివారం వైభవంగా నిర్వహించారు. పల్నాటి రణక్షేత్రం శోభాయమానంగా మారింది. కుంకుమ బండ్లతో యువకులు గ్రామోత్సవం కనుల పండువగా కొనసాగింది. రంగురంగుల విద్యుత్‌ దీపాలతో, పూలతో అందంగా అలంకరించారు. కుంకుమ బండ్ల రాకతో అమ్మవారి ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. బండ్ల వెంట మహిళలు బోనాలతో తరలివచ్చారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి సమర్పించారు. అనంతరం పోలేరమ్మ తల్లి, పాత పాటేశ్వరమ్మ ఆలయాలకు వెళ్లి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. గ్రామాన్ని చల్లగా చూడాలని, పాడి పంటలతో లోగిళ్లు కళకళలాడాలని మహిళలు పూజలు చేశారు.



అమ్మవారికి బోనాలు సమర్పించడానికి వస్తున్న భక్తులు

గంజాయి విక్రయ ముఠా అరెస్టు

- నిందితుల్లో ఇద్దరు మహిళలు
- మిగిలిన వారి కోసం గాలింపు

నరసరావుపేట టౌన్‌: గంజాయి విక్రయ ముఠాను అరెస్ట్‌ చేసి రూ.3 లక్షల విలువైన 10 కేజీలతో పాటు రూ.62 వేల నగదు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ కె. నాగేశ్వరరావు తెలిపారు. తన బంగళాలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాల్ని వెల్లడించారు. గుంటూరు రోడ్డు స్వర్గపురి వద్ద అక్రమంగా గంజాయి తరలిస్తున్నారన్న సమాచారం మేరకు పల్నాడు జిల్లా ఎస్పీ ఆదేశాలతో టూటౌన్‌ సీఐ హైమారావు, ఎస్‌బీ ఎస్‌ఐ సముందర్‌ వలి ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు చేపట్టారని తెలిపారు. ఇందులో నరసరావుపేటకు చెందిన పోగు వెంకటేశ్వరి, వినుకొండకు చెందిన సుల్తాన్‌బీ, గంజి సుబ్బారావు గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారని చెప్పారు. వారి వద్ద నుంచి 10 కేజీల గంజాయి, సెల్‌ ఫోన్‌లు, నగదు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. విచారణలో వైజాగ్‌ పరిసర ప్రాంతాల నుంచి గంజాయిను కొనుగోలు చేసి పల్నాడు జిల్లాలో నిందితులు అమ్ముతున్నట్లు తేలిందని తెలిపారు. నిందితుల వద్ద లభ్యమైన సెల్‌ఫోన్‌ కాల్‌ డేటా ఆధారంగా కేసులకు సంబంధం ఉన్న నిందితుల కోసం గాలిస్తున్నామని పేర్కొన్నారు. ఇద్దరు మహిళలతో పాటు మరో నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు డీఎస్పీ తెలిపారు.



స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులతో డీఎస్పీ కె. నాగేశ్వరరావు

పత్రాలు లేని 46 వాహనాలు, రెండు ఆటోలు సీజ్‌

వరవకట్టలో ఆదివారం పోలీసులు డీఎస్పీ కె. నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కార్డన్‌ సెర్చ్‌ నిర్వహించారు. సరైన పత్రాలు లేని 46 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వరవకట్టలో తెల్లవారుజామున 4 గంటల నుంచి 7 గంటల వరకు అనుమానిత ప్రదేశాలు, ఇళ్లలో తనిఖీలు చేపట్టినట్లు చెప్పారు. ఆధార్‌ కార్డులు లేని 18 మందిని అనుమానితులుగా గుర్తించి బైండోవర్‌ చేశామని, కొన్ని ఇళ్లలో రాడ్‌లు, కర్రలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పాలు, నూనె, ఎరువులు తదితర వాటిల్లో కల్తీ జరుగుతున్నట్లు సమాచారం ఉందని, త్వరలోనే తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తనిఖీల్లో వన్‌టౌన్‌, టూటౌన్‌, రూరల్‌ సీఐలు విజయ్‌చరణ్‌, హైమారావు, పి. రామకృష్ణ, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

గద్దర్‌ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

కుమార్తె వెన్నెల

సత్తెనపల్లి: సమ సమాజ స్థాపనకు గద్దర్‌ ఆశయాల్ని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని ప్రజా యుద్ధనౌక గద్దర్‌ కుమార్తె జి.వెన్నెల అన్నారు. సత్తెనపల్లి నియోజకవర్గ గద్దర్‌ సాంస్కృతిక సంస్మరణ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో పరివర్తన పాఠశాల ఆవరణలో ఆదివారం గద్దర్‌ ప్రథమ వర్ధంతి సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వెన్నెల మాట్లాడుతూ సమ సమాజం స్థాపనకు జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తి గద్దర్‌ అన్నారు. ఆయన ఆశయాల సాధన కోసం ప్రజాస్వామ్య వాదులు, గద్దర్‌ సాంస్కృతిక వారసులు, ప్రజాసంఘాల నాయకులు, అభిమానులు ముందుకు రావాలని కోరారు. సభకు రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) పల్నాడు జిల్లా కార్యదర్శి జెల్ది విజయప్రసాద్‌ అధ్యక్షత వహించారు. దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షులు కొరబండి ఆంథోని, కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ చుక్కా చంద్రపాల్‌, గద్దర్‌ సాంస్కృతిక సంస్మరణ సమన్వయ కమిటీ కన్వీనర్‌ గుంటూరు ఆశీర్వాదం, వ్యవసాయ మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌ పెండెం బాబూరావు, దళిత మహాసభ నాయకుడు కొరబండి బాబూరావు, పిల్లి చెన్నారావు, మాజీ కౌన్సిలర్‌ పెద్దింటి వెంకటేశ్వర్లు, ప్రజాచైతన్య భారతి అధ్యక్షులు దూపగుంట్ల జానకీరామారావు పాల్గొన్నారు. అనంతరం వెన్నెలను సన్మానించి ప్రత్యేక జ్ఞాపికను అందించారు.



పరివర్తన పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న వెన్నెల

స్కూల్‌ డేస్‌.. హ్యాపీ డేస్‌



విజయపురిసౌత్‌: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1988-89 మధ్య పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక మాతాస రోవర్‌ రిసార్ట్స్‌లో తిరిగి కలుసుకున్నారు. అపురూపమైన ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పరస్పర పలకరింపులు, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఫోన్‌ నంబర్లు, చిరునామాలు సేకరించుకున్నారు. తమ ఉన్నతికి దోహదపడిన ఆనాటి గురువుల్ని గుర్తు చేసుకున్నారు. పాఠశాలకు వెళ్లి అపురూపమైన జ్ఞాపకాల్ని తమ స్నేహబంధానికి గుర్తుగా గ్రూప్‌ ఫోటోలు దిగారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఏ. రమేష్‌, ధర్మవరపు సుబ్రహ్మణ్యం, జె. మల్లి, వాణి, నీలిమ, శ్రీను, మత్తయి, వేణు, రాజేష్‌ పాల్గొన్నారు.

నరసరావుపేటలో విశాఖ కోఆపరేటివ్‌ బ్యాంకు ప్రారంభం

నరసరావుపేట: రాష్ట్రంలో సహకార వ్యవస్థ ఎదుగుదలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏనాడు సహాయం చేయలేదని మాజీ ఎమ్మెల్యే, బ్యాంకు మాజీ చైర్మన్‌ మానం ఆంజనేయులు విమర్శించారు. ఇప్పటివరకు సీఎంలకు కూడా సహకార వ్యవస్థపై నమ్మకం లేదని తెలిపారు. నరసరావుపేట పట్టణంలోని అరండల్‌పేటలో ఆదివారం విశాఖపట్టణం కో ఆపరేటివ్‌ బ్యాంకు 52వ బ్రాంచిని ఆయన ప్రారంభించారు. అనంతరం ప్రైవేటు ఫంక్షన్‌ హాలులో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. సహకార వ్యవస్థ పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉండాలనే లక్ష్యంతో విశాఖపట్నం కో-ఆపరేటివ్‌ బ్యాంకును స్థాపించినట్లు తెలిపారు. 2025 మార్చి నాటికి తమ బ్యాంక్‌ రూ.8వేల కోట్ల డిపాజిట్లు సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. బ్రాంచిలో డిపాజిట్లు వచ్చినా, రాకపోయినా రూ.100కోట్ల రుణాలు ఇవ్వడం ఖాయమని పేర్కొన్నారు. అధ్యక్షత వహించిన చైర్మన్‌ చలసాని రాఘవేంద్రరావు ఈ ఏడాది 12 లక్షల మందికి రూ.39కోట్లు డివిడెండ్‌ ఇచ్చామని తెలిపారు. ది సిటిజన్‌ కోపరేటివ్‌ సొసైటీ హైదరాబాద్‌ చైర్మన్‌ పీఆర్‌వీపీఎస్‌ రంగరాజు రూ.2కోట్లు డిపాజిట్లును అందిస్తున్నట్లు సభలో ప్రకటించారు. నరసరావుపేట నూతన బ్రాంచ్‌లో తొలి డిపాజిట్‌ కింద రూ.2లక్షల చెక్కు అందజేసిన పట్టణ ప్రముఖులు బత్తుల మురళికి బాండ్‌ అందజేశారు. ది గుత్తి కోఆపరేటివ్‌ టౌన్‌ బ్యాంక్‌ చైర్మన్‌, ది ఆంధ్ర ప్రదేశ్‌ రాష్ట్ర కోఆపరేటివ్‌ అర్బన్‌ బ్యాంక్‌, క్రెడిట్‌ సొసైటీ ఫెడరేషన్‌ ఉపాధ్యక్షులు షేక్‌ అబ్దుల్‌ జిలాని, ది గుంటూరు కోపరేటివ్‌ అర్బన్‌ బ్యాంక్‌ చైర్మన్‌ బొనబోయిన శ్రీనివాస్‌ యాదవ్‌, ఆత్మీయ అతిథులు ఏలూరు గురవయ్య, గుంటూరు మహిళా కోఆపరేటివ్‌ అర్బన్‌ బ్యాంక్‌ చైర్‌పర్సన్‌ వాణి సుజాత, కంబం కోఆపరేటివ్‌ బ్యాంక్‌ చైర్మన్‌ జనార్దనరావు, జిల్లా సహకార అధికారి ఎం. వెంకటరమణ. డీసీఏవో శ్రీనివాసరావు, ఈడీఎ రామకృష్ణారావు, పాలకవర్గం వైస్‌చైర్మన్‌ ఎం.రాఘవరావు డైరెక్టర్లు పొట్లూరి వెంకటరమణ, కంద ప్రసాదరావు, జేవీ సత్యనారాయణ మూర్తి, చిన్నం కోటేశ్వరరావు పాల్గొన్నారు.



బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న మాజీ చైర్మన్‌ మానం ఆంజనేయులు

గుర్తు తెలియని వృద్ధుడు మృతి

రేపల్లె రూరల్‌: గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటన ప్రభుత్వ వైద్యశాల సమీపంలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ ఎ.మల్లికార్జునరావు వివరాల మేరకు.. ప్రభుత్వ వైద్యశాల కాంపౌండ్‌ గోడ వద్ద సుమారు 65 నుంచి 70 సంవత్సరాల మధ్య వయస్సున్న వృద్ధుడు మృతి చెంది ఉన్నాడన్నారు. గత నాలుగు రోజులుగా సమీప ప్రదేశాలలో సంచరించినట్లు సమాచారం ఉందన్నారు. స్థానికుల సమాచారం మేరకు మృతదేహాన్ని పరిశీలించినట్లు తెలిపారు. మృతుడు ఎర్ర రంగు బనియన్‌, ఆకుపచ్చ రంగు నిక్కరు ధరించి ఉన్నాడని చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు ప్రభుత్వ వైద్యశాల మార్చురీలో ఉన్న మృతదేహాన్ని తీసుకెళ్లాలని చెప్పారు.

విద్యుత్‌ షార్ట్‌ సర్క్యూట్‌తో రెండు ఇళ్లు దగ్ధం

- ఒకరికి తీవ్ర గాయాలు
- రూ. 28లక్షల ఆస్తి నష్టం

వెల్దుర్తి: విద్యుత్‌ షార్ట్‌ సర్క్యూట్‌తో రెండు ఇళ్లు దగ్ధంతో పాటు వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని గుండ్లపాడులో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన జవిశెట్టి వెంకటేశ్వర్లు ఇంటిలో షార్ట్‌ సర్క్యూట్‌తో కావటంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. 20 సవర్ల బంగారం, రూ. 10లక్షల నగదు, రెండు ల్యాప్‌ట్యాప్‌లు, పొలం పాసు పుస్తకాలు, పిల్లల సర్టిఫికెట్లు, దుస్తులు, విలువైన డాక్యుమెంట్లు, నిత్యవసర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. రూ. 20లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు వాపోయారు. ఆయన సోదరుడు జవిశెట్టి బ్రహ్మయ్య ఇంటికీ మంటలు వ్యాప్తి చెందడంతో ఎనిమిది సవర్ల బంగారం, రూ. 4లక్షల నగదుతో పాటు సర్టిఫికెట్లు, విలువైన డాక్యుమెంట్లు, నిత్యావసర వస్తువులు కాలిపోయాయి. విషయం తెలుసుకున్న తహసీల్దార్‌ రాజశేఖర్‌ నాయక్‌, వీఆర్వో వెంకటరావు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. అనంతరం ప్రమాదంలో గాయపడి మాచర్లలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న వెంకటేశ్వర్లును పరామర్శించారు.




వెంకటేశ్వర్లును వివరాలు అడిగి తెలుసుకుంటున్న తహసీల్దార్‌ రాజశేఖర్‌ నాయక్‌ తదితరులు

బైక్‌ దొంగిలించిన యువకుడికి దేహశుద్ధి

పోలీసులకు అప్పగింత

నాదెండ్ల: ద్విచక్ర వాహనాన్ని దొంగిలించి అమ్మేందుకు యత్నించిన యువకుడిని స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేసిన సంఘటన శనివారం రాత్రి గణపవరంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కాట్రు వెంకటేశ్వర్లు కుటుంబంతో కలిసి ఈ నెల 22న చిలకలూరిపేటలో ఫంక్షన్‌కు వెళ్లారు. ఈ సమయంలో గ్రామంలో ఇంటి ముందు తన బైక్‌ను ఉంచారు. రాత్రి 11 గంటలకు తిరిగి చేరగా వాహనం కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన అచ్చి అంకమ్మ, వెంకటేష్‌ వాహనాన్ని దొంగిలించి, అమ్మేందుకు ప్రయత్నిస్తుండగా స్థానికులు గమనించి వాహన యజమానికి సమాచారమిచ్చారు. దీంతో అచ్చి అంకమ్మను పట్టుకుని ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. అతడ్ని విద్యుత్‌ స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. అయితే, వాహనాన్ని దొంగిలించినది తాను కాదని, వెంకటేష్‌ అని, తాను అమ్మేందుకు ప్రయత్నించానని చెప్పాడు. గతంలో అంకమ్మపై పలు దొంగతనం కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు.



గ్రామస్తులు స్తంభానికి కట్టేసిన అంకమ్మ

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌ మృతి

రొంపిచర్ల: మండలంలోని అన్నవరప్పాడు గ్రామ సమీపంలో శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్‌ వేపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌ షేక్‌ జాని(45) ఉరఫ్‌ ఆటో జాని మృతి చెందాడు. మండలంలోని గోగులపాడుకు జాని సంతమాగులూరు అడ్డరోడ్డులో ఉన్న బంధువుల్ని తీసుకొచ్చేందుకు ఆటోలో బయలుదేరాడు. అన్నవరప్పాడు గ్రామ సమీపంలోకి రాగానే రోడ్డు పక్క ఆగి ఉన్న లారీని అధిగమించే క్రమంలో దాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో జానీకి తీవ్ర గాయాలయ్యాయి. అతడ్ని 108 అంబులెన్స్‌లో నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ జాని మృతి చెందాడు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. రొంపిచర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



జాని మృతదేహం